అకాల వర్షాలు.. కర్షకులకు కష్టాలు

- పలు గ్రామాల్లో తడిసిన వరి పంట
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- వడివడిగా పంట ఒబ్బిడి



శరభవరంలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

ప్రత్తిపాడు: అకాల వర్షాలు రైతులకు కష్టాలను తెచ్చిపెట్టాయి. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో ఆది నుంచి రబీ సాగు సజావుగా సాగింది. పంట చేతికి వచ్చే తరుణంలో అకాల వర్షాలు పడడంతో రైతుల పంటలకు నష్టం కలుగుతోంది. వర్షాల నుంచి పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు.

4, 200 ఎకరాల్లో రబీసాగు

ప్రత్తిపాడు మండలంలో ఈ ఏడాది 4, 200 ఎకరాల్లో రైతులు రబీ వరి సాగు చేశారు. ఎక్కువ మంది రైతులు ఎంటీయూ 1156, 1121, ప్రైవేటు వంగడాలైన లీడరు, సంపద, సాధన తదితర రకాలను సాగు చేశారు. ప్రస్తుతం పంట దశకు చేరుకుంది. పలు గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీల కొరత, పనిలో వేగం కోసం యంత్రాలతో ఆదరాబాదరగా రైతులు కోతలు మొదలుపెట్టారు. ఇప్పటికే సుమారు 1700 ఎకరాల్లో పంటను రైతాంగం ఒబ్బిడి చేసుకుంది. ప్రత్తిపాడు, ఏలూరు, లంపకలోవ, పెదశంకర్లపూడి, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు తదితర గ్రామాల్లో ధాన్యంరాశులు ఉన్నాయి. కాగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో ఆరబెట్టిన ధాన్యం, ధాన్యంరాశులు తడిసిపోయాయి. కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను బరకాలు, ప్లాస్టిక్ కవర్లతో కప్పి రైతులు కాపాడుకుంటున్నారు. మంగళవారం వాతావరణం కాస్త తెరిపివ్వడంతో తడిసిన ధాన్యం రాశులను రైతులు రోడ్లపై ఆరబెట్టారు. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం, వ్యవసాయ శాఖ జగ్గంపేట ఇన్‌చార్జి ఏడీఏ యింటి వీర గంగాధర్ తదితర సిబ్బంది ప్రత్తిపాడు, ఏలూరు, టి.రాయవం తదితర గ్రామాల్లో పర్యటించారు. తడిసిన వరి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా మంగళవారం వరుసగా రెండోరోజు భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం కాగా మధ్యాహ్నం నుంచి వర్షం పడింది. ముందస్తుగా వ్యవసాయశాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేశారు. దీంతో చాలావరకు రైతులు తమ పంటలను ఒబ్బిడి చేసుకున్నారు. పలుకాలనీల్లోని ప్రధానరహదారులపై నీరు నిలిచిపోయింది. కాలనీల్లో డ్రైన్లు అధ్వానంగా ఉండడంతో వర్షపునీరు పోయే మార్గం లేక రహదారులపై నిలిచిపోయింది. ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం ఇంకా ముంపులోనే ఉంది.

వరికోతలు వాయిదా వేసుకోండి

జగ్గంపేట: మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని ఎంపీడీఓ హరికృష్ణ, తహసీల్దార్ శ్రీదేవి సూచించారు. మండలంలోని సీతానగరం, కాట్రావులపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం వారు పర్యటించారు. వర్షానికి తడిసిన పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వర్షాలు తగ్గే వరకు కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. కోసి పనలపై ఉన్న పంటను ఒబ్బిడి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీరామ్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ఏలూరులో రైతులకు సూచనలిస్తున్న అధికారులు



ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిలిచిపోయిన నీరు



కాట్రావులపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

క్లుప్తంగా

పేదలకు నిత్యావసరాల పంపిణీ



టి.వెంకటాపురంలో వృద్ధులు, పేదలకు నిత్యావసరాలు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

తుని రూరల్: అనకాపల్లి జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలు, వృద్ధులకు మంగళవారం నిత్యావసర సరుకులు, దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. మండలంలోని డి.పోలవరం, టి.వెంకటాపురం, ఎర్రకోనేరు గ్రామాల్లో ఎంపిక చేసిన 90 పేద కుటుంబాలకు వీటిని అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పేదలకు వీటిని అందించినట్టు ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయ్ కుమార్ తెలిపారు. డైరెక్టర్లు వి.జయబాబు, ప్రసాద్, బాబి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులతో వలసల నివారణ



వి.కొత్తూరులో ఉపాధి పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమణ

తుని రూరల్: జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస పోయే కూలీలను నివారించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ అన్నారు. వెలమ కొత్తూరులో రాజు చెరువులో మంగళవారం ఆయన ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. కూలీలతో కలిసి పూడిక తీశారు. అర్హులు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు కిల్లి సన్యాసిరావు, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దుంగల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బైలపూడి నాగేశ్వరరావు, రాళ్లపల్లి సూరిబాబు, సప్ప శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న మెడికల్ ఆఫీసర్ కన్యాకుమారి

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు లయన్స్‌క్లబ్ సభ్యులు మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనకాపల్లి జిల్లా గోపాలపట్నం గ్రామానికి చెందిన ఉదయ భాస్కర వర్మ సమకూర్చిన పౌష్టికాహారాన్ని సీహెచ్‌సీ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ ఎం. కన్యాకుమారి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య పరీక్షల కోసం దూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకట రత్నం, ప్రతినిధులు తాతా సాంబు, ఏడిద రెడ్డినాయుడు, కె. సంజీవరావు, ఇంజినీర్ బి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడకు అభినందనల వెల్లువ



కిర్లంపూడిలో అభిమానులతో ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి: తుని రైలు దహనం ఘటనకు సంబంధించి మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంపై ఉన్న కేసును కోర్టు కొట్టివేయడంతో మంగళవారం ఆయన అభిమానులు, కాపు ఉద్యమ నాయకులు సంబరాలు జరిపారు. జిల్లా నలుమూలల నుంచి భారీగా అభిమానులు తరలివచ్చి ముద్రగడకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాపు నేతలు మాట్లాడుతూ ఏళ్ల తరబడి రాజకీయాల్లో ఉండి ఎటువంటి అవినీతి ఆరోపణలు లేని ఏకైక నాయకుడు ముద్రగడ పద్మనాభం అని కొనియాడారు. తొలుత ముద్రగడ కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచారు. కాపు జేఏసీ నాయకులు తోట రాజా, గౌతు స్వామి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మామిడాడ గ్రామ శివారులో పేకాట శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురుని అరెస్టు చేసి వారి నుంచి రూ.1200 స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



మెట్టచింతలో అమ్మవారి బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉపప్రణాళిక ప్రాంతమైన మెట్టచింతలో వనదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిరిజనులు గ్రామంలోని మెట్టను చదును చేసి ఆప్రాంతం వనదుర్గమ్మ వారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తొలుత గ్రామంలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించి ప్రతిష్ఠించారు. మహిళలు, యువతులు బోనాలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా వనదుర్గమ్మ వారికి ఆలయానికి తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు.

సామూహిక లక్ష్మీనారాయణ వ్రతం



ఎస్.అన్నవరంలో సామూహిక లక్ష్మీనారాయణ వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం సామూహిక లక్ష్మీనారాయణ వ్రతం నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు, మహిళలు సాంప్రదాయబద్ధంగా వ్రతాన్ని ఆచరించారు. సాయంత్రం స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. బుధవారం ఉదయం చతుస్థానార్చన, మూల మంత్ర హవనం, లఘు పూర్ణాహుతి, సాయంత్రం పండిత సదస్యం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 5న సుదర్శన నారసింహ హోమం, మహా పూర్ణాహుతి, శ్రీచక్రస్నానం, శ్రీపుష్పయాగంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు



కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారులు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా రత్నగిరి కల్యాణ వేదికపై మంగళవారం కళాకారులు ప్రదర్శించిన సంగీత, నృత్య కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకూ కొండ గుంటూరుకు చెందిన గమ్మెటి సత్తిబాబు, బోడా శేషసాయి పావని భక్తి గీతాలు ఆలపించారు. విశాఖపట్నానికి చెందిన శ్రీడ్యాన్స్ అకాడమీ కళాకారులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. కల్యాణ మహోత్సవాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలన్నీ భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి.

ఎమ్మెల్యే పర్వతకు కృతజ్ఞతలు



శంఖవరంలో ఎమ్మెల్యే పర్వతకు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయీ బ్రాహ్మణులు

శంఖవరం: అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానంలోని కేశ ఖండనశాలలో విధులు నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులు మంగళవారం శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దేవస్థానంలో పని చేస్తున్న తమ వేతనాన్ని ప్రభుత్వం రూ.9 వేల నుంచి రూ.20 వేలు పెంచడంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ కులాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. బడుగు, బలహీన వర్గాలను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో అన్నవరం సర్పంచ్, వైఎస్సార్ సీపీ కాకినాడ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్ రాజా, వైస్ ఎంపీపీ ధారా వెంకట రమణ పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో ధర్నా చేస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు: న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ప్రత్తిపాడు కోర్టులో న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య ఆధ్వర్యంలో స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో నిరసన ప్రదర్శన, ధర్నా చేపట్టారు. స్థానిక బార్ అసోసియేషన్ సభ్యుడు యార్లగడ్డ శ్రీనివాసరావుపై రాజమహేంద్రవరం జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రతివాదికి చెందిన వ్యక్తులు చేసిన దాడిని ఖండించారు. న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలని, న్యాయవాదులపై దాడులకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ ప్రతినిధులు బొంగులూరి మధుబాబు, మళ్ల గంగాధర్, సూర్య ప్రకాష్, రాయి శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు కొల్లా వీర్రాజు, ఎ.కుక్కుటేశ్వరరావు, చెలంకూరి రామకృష్ణ, పిల్లి బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసు

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ యు.రామన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ఈ నెల 4న ఉదయం 10 గంటలకు గోకవరం నుంచి బయలుదేరి 5న గురుపౌర్ణమి రోజున అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం విష్ణుకంచి, శివకంచి, శ్రీకాళహస్తి, విజయవాడ దర్శనం అనంతరం 7వ తేదీన తిరిగి గోకవరం చేరుకుంటుందన్నారు. టిక్కెట్టు ధర రూ.3,200 అని రిజర్వేషన్ కోసం భక్తులు 73829 10258, 73829 10321 నంబర్లకు సంప్రదించాలన్నారు. బుకింగ్ బుధవారం రాత్రితో ముగుస్తుందని, ఆసక్తి ఉన్న భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు

జగ్గంపేట: ప్రస్తుత వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ సూర్యఅప్పారావు సూచించారు. మండలంలోని జె.కొత్తూరులో ప్రజలకు మంగళవారం రాత్రి దొంగతనాలు–నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఇళ్లకు తాళాలు వేసి వేరే ప్రాంతాలకు వెళ్లేవారు తమ విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో పెట్టుకోవాలని సూచించారు. వేసవిలో ఆరుబయట నిద్రించేవారు విలువైన వస్తువులు ధరించడం మంచిది కాదన్నారు. గ్రామంలో ఐదుగురు సభ్యులతో శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరరావు, ఎస్సై విద్యాసాగర్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



తునిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణ పరిధిలోని ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మంగళవారం సాయంత్రం 29వ వార్డులో కౌన్సిలర్ దోసపర్తి రాజేశ్వరి ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ– మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణికి మహిళలు హారతులు ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మహిళలు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాలువలు, మంచినీరు తదితర వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ ప్రసాదరాజుకు సూచించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, వైఎస్సార్ సీపీ తుని రూరల్ మండల కన్వీనర్ పోతల రమణ, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



వీర గణేష్

జగ్గంపేట: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మామిడాడ గ్రామానికి చెందిన కాళ్ల వీర గణేష్ బికాం చదువుకుని హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా మామిడాడలో ఉంటూ వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారు. ఈ నెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు ఇప్పటికీ ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని సోదరుడు కాళ్ల గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



అద్దరిపేట తీరంలో ఎగసిపడుతున్న అలలు

తీరంలో అలజడి

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో మంగళవారం సముద్రతీరంలో అలజడి నెలకొంది. మండలంలోని అద్దరిపేట నుంచి కొత్తచోడిపల్లిపేట వరకూ సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. అలల ఉధృతికి పలు చోట్ల సముద్రతీరం గట్టు కోతకు గురైంది. ప్రస్తుతం వేట నిషేధం కావడంతో మత్స్యకారులు తమ బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. తీరప్రాంతంలో ప్రతికూల పరిస్థితుల వల్ల మత్స్యకారులు నాటు పడవలపై సైతం వేటకు వెళ్లరాదని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు.

పోలీస్ స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన



కిర్లంపూడిలో పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటప్పారావు

కిర్లంపూడి: పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఎస్పీ వెంకటప్పారావు కాంట్రాక్టర్ నల్లా రాజశేఖర్‌ను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి పక్కన నిర్మిస్తున్న నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మరో నెల రోజుల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణం పూర్తివుతుందని చెప్పారు. ఆయన వెంట జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు, కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు ఉన్నారు.

అయ్యప్ప స్వామికి ఉత్తర నక్షిత్ర పూజలు



తుని కత్రాళ్లకొండ అయ్యప్ప ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు, భక్తులు

తుని: స్థానిక కత్రాళ్లకొండ అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం ఉత్తర నక్షిత్ర పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం జరిపారు. ఏడాది పొడవునా అర్చన, హోమం తదితర కార్యక్రమాలకు పలువురు భక్తులు సభ్యత్వం నమోదు చేసుకున్నారని ట్రస్టీ పమ్మి లక్ష్మణాచార్యులు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

52 మందికి కంటి పరీక్షలు



హంసవరంలో వృద్ధులకు కంటి పరీక్షలు చేయిస్తున్న సర్పంచ్ మేరీఅవినాష్

తుని రూరల్: మండలంలోని హంసవరంలో సర్పంచ్ రాయి మేరీ అవినాష్ ఆధ్వర్యంలో మంగళవారం వేర్వేరుగా ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరాలను నిర్వహించారు. తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ అన్వేషి పర్యవేక్షణలో 52 మందికి కంటి పరీక్షలు చేసి ఉచిత మందులు అందజేశారు. వీరిలో 30 మందిని కళ్లజోళ్లు, ఏడుగురిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు సర్పంచ్ మేరీ అవినాష్ తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో 126 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు ఆమె తెలిపారు.

డిప్లమో ఇన్ లాంగ్వేజ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు: సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ 10 నెలల డిప్లమో ఇన్ లాంగ్వేజ్ ఎడ్యుకేషన్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ మంగళవారం తెలిపారు. తరగతులు జూలై ఐదో తేదీ నుంచి ప్రారంభమవుతాయనని, ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.